## డెస్టినేషన్ వెడ్డింగ్ హబ్‌గా తెలంగాణ: జూపల్లి



హైదరాబాద్, జూన్ 9(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం, డెస్టినేషన్ వెడ్డింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరాబాద్‌లోని హరిత ప్లాజాలో పర్యాటకశాఖ సహకారంతో ఆదివారం తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ సౌతిండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌లో మంత్రి ప్రసంగించారు. ప్రకృతి రమణీయతకు ఈ ప్రాంతం ప్రతీకగా నిలుస్తుందని, ఎన్నో సుందరమైన ప్రదేశాలు, పుష్కలమైన వనరులు ఉన్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే అద్భుతమైన డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. దీనికోసం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాల (పీపీపీ) ద్వారా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తామని చెప్పారు. తద్వారా పర్యాటక శాఖ అభివృద్ధితో ఆదాయం పెరగడంతోపాటు యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను లభిస్తాయని మంత్రి వివరించారు. మెడికల్, ఎకో, అడ్వెంచర్, ఆధ్యాత్మిక టూరిజం సహా పర్యాటకానికి అవసరమున్న వివిధ రంగాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ ఎండీ రమేశ్‌నాయుడు, పర్యాటక శాఖ డైరెక్టర్ కే నిఖిల, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేవీలో తొలి మహిళా హెలికాప్టర్ పైలట్‌గా అనామిక

న్యూఢిల్లీ, జూన్ 9: సబ్-లెఫ్టినెంట్ అనామిక బీ రాజీవ్ అరుదైన ఘనతను సాధించారు. ఆమె ప్రతిష్ఠాత్మక 'గోల్డెన్ వింగ్స్'ను అందుకున్న అనంతరం భారత నౌకాదళంలో మెదటి మహిళా హెలికాప్టర్ పైలట్ అయ్యారు. తమిళనాడు అరక్కోణంలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆమె ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. అలాగే లఢక్‌కు చెందిన మొదటి కమిషన్డ్ నౌకాదళ అధికారి లెఫ్టినెంట్ జమ్యాంగ్ త్సెవాంగ్ సైతం క్వాలిఫైడ్ హెలికాప్టర్ పైలట్‌గా పట్టభద్రురాలయ్యారు. మొత్తం 21 మందికి ఈస్టర్న్ నావల్ కమాండింగ్ చీఫ్ అయిన వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ గోల్డెన్ వింగ్స్‌ను అందజేశారు. కాగా, ఈ శిక్షణ తర్వాత అనామిక రాజీవ్ సీ కింగ్స్, ఏఎల్‌హెచ్ ధ్రువ్స్, చేతక్స్, ఎంహెచ్-60 ఆర్ వంటి హెలికాప్టర్‌లు నడపడానికి అర్హత సాధించిన తొలి మహిళా పైలట్‌గా నిలిచారు. కాగా, నేవీ ఇప్పటికే సముద్ర నిఘాకు డోర్నియర్-228 వంటి హెలికాప్టర్లకు మహిళా పైలట్‌లను వినియోగిస్తున్నది.

## సైబర్ క్రైమ్ బాధితులకు
# రూ.7.9 కోట్లు రిఫండ్

**మోసాలకు సీఎస్‌బీ అడ్డుకట్ట • 'లోక్‌అదాలత్' ద్వారా న్యాయం**
**2,973 కేసులు పరిష్కారం • పెండింగ్‌లో మరో 1,171 కేసులు**

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : వివిధ రకాల సైబర్ నేరాల బాధితుల ఖాతాల్లో రూ.7.9 కోట్లు రిఫండ్ చేసినట్లు టీజీసీఎస్‌బీ (తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో) డైరెక్టర్ శిఖాగోయెల్ ఆదివారం తెలిపారు. మోసపోయినట్టు తెలియగానే బాధితులు సత్వరం 1930కి కాల్ చేయడం వల్ల సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి డబ్బు వెళ్లకుండా టీజీసీఎస్‌బీ అడ్డుకున్నట్టు వివరించారు. స్తంభింపజేసిన నగదును తిరిగి ఇప్పించాలని రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా రూ.7.9 కోట్లను వారి ఖాతాల్లోకి మళ్లించారు. ఈ ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎల్ఎస్ఏ) సహకారం మరువలేనిదని శిఖాగోయెల్ తెలిపారు. సైబర్ నేరాల్లో డబ్బులు కోల్పోయిన కేసులు 4,144 నమోదవగా..శనివారం 2,973 కేసులను పరిష్కరించి డబ్బు వాపసు చేశారు. ఇంకా 1,171 కేసులు పెడింగ్‌లో ఉన్నట్లు శిఖాగోయెల్ వెల్లడించారు. జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఒకేరోజు ఇంత పెద్దమొత్తంలో డబ్బులు బాధితుల ఖాతాలకు బదిలీ చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. గత మార్చిలో టీజీసీఎస్‌బీ, టీజీఎల్ఎస్ఏలు లోక్ అదాలత్ ద్వారా 803 కేసులను క్లియర్ చేసి, రూ.3,66,83,748 బాధితులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. వివిధ రూపాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని, తెలియని లింక్స్‌ను క్లిక్ చేయొద్దని, వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరు అడిగినా చెప్పొద్దని కోరారు. ఏదైనా సైబర్ నేరానికి గురైనట్టు అనుమానం వస్తే వెంటనే (గోల్డెన్ అవర్‌లోగా) 1930కి కాల్ చేయాలని సూచించారు.




















